

నేడు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ రద్దు

పార్వతీపురం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలో అర్జీదారులు గమనించాలన్నారు. మండల అధికారులు కూడా ఈ విషయాన్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు. కాగా వచ్చే సోమవారం నుంచి యథావిధిగా పీజీఆర్ఎస్ కొనసాగుతుందని వెల్లడించారు.

పండుగ వేళ ఉలికిపాటు!

- పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో బాణసంచా పేలుడు
- నలుగురికి తీవ్ర గాయాలు
- లగేజీ కిందకు దించే క్రమంలో ఘటన
- పార్సిల్ కార్యాలయం షెడ్ పైభాగం, కిటికీ అద్దాలు ధ్వంసం
- భయభ్రాంతులకు గురైన ప్రయాణికులు
- అధికారుల పర్యవేక్షణ లోపంపై విమర్శల వెల్లువ



ఘటనా స్థలంలో క్షతగాత్రులు ఇలా..

బెలగాం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం పట్టణం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఎన్నడూ లేని విధంగా భారీ పేలుడు సంభవించింది. దీంతో ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. వాస్తవంగా మందుగుండు సామగ్రిని బస్సులు, రైళ్లలో పార్సిల్ సర్వీస్ ద్వారా పంపించకూడదు. వాటి వల్ల సంభవించే ప్రమాదం చాలా తీవ్రంగా ఉంటుంది. అయితే ఆదివారం పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో చోటుచేసుకున్న పేలుడు ఘటనతో ప్రయాణికులు, స్థానికులు షాక్‌కు గురయ్యారు. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాగా సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. క్షతగాత్రుల కుటుంబాల్లో మాత్రం పండుగ సందడి లేకుండా పోయింది. వివరాల్లోకి వెళ్తే..

పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లోకి ఆదివారం ఉదయం విజయనగరం నుంచి ఓ బస్సు వచ్చింది. దానికి సమీపంలోనే ఉన్న ఆర్టీసీ పార్సిల్ కార్యాలయం నుంచి ఓ కళాసి వచ్చి.. ఆ బస్సులో సామాన్లు దించేందుకు వెళ్లాడు. మందుగుండు సామగ్రి అని తెలియక లగేజీ బాక్స్‌ను పార్సిల్ కౌంటర్ వద్దకు తీసుకొచ్చి కిందకు దించగా ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలుడు సంభవించింది. దీంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పేలుడు ధాటికి పార్సిల్ కౌంటర్ షెడ్ పైభాగం, కిటికీ అద్దాలు ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో కళాసి రెడ్డి రమేష్, బస్సు డ్రైవ ర్ తెర్లి రవి, తోపుడు బండి కార్మికుడు సుందరరావు, మరో వ్యక్తి కె.రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన క్షతగాత్రులను పార్వతీపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి, ఆర్.రమేష్‌ను మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు, కె.రమేష్‌ను విజయనగరం మహారాజా ఆసుపత్రికి తరలించారు. అయితే కేజీహెచ్‌లో చికిత్స పొందు తూ డ్రైవర్ రవి మృతి చెందారు. ఆయనది నర్సిపురం గ్రామంగా తెలిసింది. కాగా విజయనగరంలోని పార్సిల్ బుక్ చేసిన వారి ఫోన్ నెంబర్, పార్వతీపురంలోని పార్సిల్ తీసుకునే వారి ఫోన్ నెంబర్ ఒకటే ఉండడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పార్సిల్ పంపిన వ్యక్తి జియ్యమ్మవలస నిమ్మలపాడు గ్రామానికి చెందిన కిషోర్ కుమార్ అని తెలుస్తోంది. 25 కేజీల జనరల్ ఐటమ్ పేరుతో పార్సిల్ బుక్ అయినట్లుగా రశీదు ఉన్నట్లు ఆర్టీసీ కొరియర్ సర్వీసు అధికారులు చెబుతున్నారు. ఎస్పీ మాధవరెడ్డి తన సిబ్బందితో అక్కడకు చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వెల్లడించారు. మరోవైపు ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాణసంచాను పార్సిల్ ద్వారా పంపించకూడదన్నారు. ఇటువంటి దుశ్చర్యకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆయనతోపాటు ఎస్పీ జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. అక్కడ వైద్యాధికారులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని ఆదేశించారు. డీఎంహెచ్‌వో భాస్కరరావు కూడా ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. సంబంధిత వైద్యులను అప్రమత్తం చేశారు.



ధ్వంసమైన పార్సిల్ కార్యాలయం షెడ్ పైభాగం, కిటికీ అద్దాలు



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

మంత్రుల ఆరా..

పార్వతీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో జరిగిన బాణసంచా పేలుడు ఘటనపై మంత్రులు గుమ్మిడి సంధ్యారాణి, అనిత, కింజరాపు అచ్చెన్నాయుడు స్పందించారు. అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. సంఘటన ఏ విధంగా జరిగింది. దానికి గల కారణాలు.. తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

రాళ్లు రప్పలు దాటి.. ఆసుపత్రికి చేరి!

- మూడు కిలోమీటర్లు నడిచి కొండ దిగి..
- గిరిజనులకు తప్పని డోలీ మోత

కొమరాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిశిఖర గ్రామాల ప్రజలకు డోలీ మోతలు తప్పడం లేదు. సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఇక్కట్లకు గురవ్వాల్సి వస్తోంది. గ్రామంలో ఎవరు అనారోగ్యానికి గురైనా కాలినడకన కొండలు దాటి ఆసుపత్రులకు చేరుకోవాల్సి వస్తోంది. కొమరాడ మండలం పూడేసు పంచాయతీ పరిధి గుమడింగి కొండ శిఖర గ్రామానికి చెందిన ఆరిక దండు కొద్దిరోజులుగా జ్వరంతో బాధ పడుతున్నాడు. ఆదివారం పరిస్థితి విషమించడంతో భార్య జమ్మాలమ్మ, కొడుకు మోహన్‌రావు తీవ్ర ఆందోళన చెందారు. చివరకు గ్రామస్థులు హరి, నాగార్జున సాయంతో దండుకు డోలీ కట్టారు. సుమారు మూడు కిలోమీటర్లు వారు రాళ్ల రప్పలు దాటి.. కొండ దిగి ఒడిశా రాష్ట్రం కొమ్ముగండ గ్రామం చేరుకొన్నారు. అక్కడ నుంచి ఆటో ద్వారా సుమారు 35 కిలోమీటర్లు ప్రయాణించి.. పార్వతీపురం జిల్లా కేంద్రాసుపత్రికి చేరుకున్నారు. వైద్యులు దండును పరీక్షించి చికిత్స అందించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి బాగానే ఉంది. తమ గ్రామానికి రహదారి సౌకర్యం లేకపోవడంతో అత్యవసర వేళల్లో డోలీ మోతలు తప్పడం లేదని ఆ గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. వాస్తవంగా గుమడింగికి పది కిలోమీటర్ల దూరంలో పూడేసు గ్రామం ఉంది. అయితే చుట్టూ తిరిగి వెళ్లడం కంటే.. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒడిశా రాష్ట్రం కొమ్ము గండ వరకు డోలీతో చేరుకుని అక్కడి నుంచి వాహనాల ద్వారా పార్వతీపురం ఆసుపత్రికి వెళ్తున్నట్లు వారు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రజా ప్రతి నిధులు, అధికారులు స్పందించి గుమడింగి, కుం తేసు, పూడేసు, మసిమండ, పెదశాఖ, గుణద, తలేసు, నయా గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని, డోలీ మోతలు తప్పించాలని వారు కోరారు.



రోగిని మోసుకుంటూ కొండ దిగువకు వెళ్తున్న గిరిజనులు

ముసురుతో రైతుల ఇక్కట్లు

- జిల్లావ్యాప్తంగా వర్షం
- పంటలను కాపాడుకునేందుకు పాట్లు

8లో

సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు

8లో

నిలకడగా నాగావళి

- దిగువకు 2,100 క్యూసెక్కులు విడుదల

6లో

దీపావళి శోభ

- రద్దీగా మార్కెట్లు
- వర్షంతో కొనుగోలుకు ఆటంకాలు

పార్వతీపురం/ పార్వతీపురం టౌన్/పాలకొండ/సాలూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో దీపావళి శోభ ఉట్టిపడింది. యువకులు, పెద్దలు బాణసంచా దుకాణాలకు బారులు తీరారు. సమయం లేకపోవడంతో ఆదివారం భారీస్థాయిలో మందుగుండును కొనుగోలు చేశారు. మార్కెట్‌లో కొత్తగా దిగిన మతాబులు, బాంబులు, తారాజువ్వలను కొనడం కనిపించింది. ప్రధాన మార్కెట్లు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. తాత్కాలిక బాణసంచా దుకాణాలు కూడా భారీగా ఏర్పాటయ్యాయి. అయితే వర్షం కారణంగా ప్రజలు కాస్త ఇబ్బంది పడ్డారు. కొన్ని చోట్ల తడుస్తూనే పూజా సామ్రగి, బాణ సంచాను కొనుగోలు చేశారు. పార్వతీపురం పట్టణంలో పండుగ సందడి కనిపించలేదు. దీపావళి పర్వదినం ముందు రోజు వర్షం కారణంగా పెద్దగా ఎవరూ బయటకు రాలేదు.



పాలకొండలో పండ్లను కొనుగోలు చేస్తున్న మహిళలు



సాలూరులో బాణసంచా షాపు వద్ద ప్రజలు ఇలా..

మరోవైపు పూజా సామగ్రి ధరలు అమాంతం పెరిగిపోయాయి. కొబ్బరికాయలు, అరటి పండ్ల సైజును బట్టి వ్యాపారులు ధర నిర్ణయించడంతో కొనుగోలుదారులు బెంబేలెత్తిపోయారు. నిన్న మొన్నటి వరకు అన్ని రకాల పండ్లు కిలో వంద రూపాయల నుంచి రూ.150 పలకగా, ఆదివారం రూ.200 నుంచి రూ.250కు విక్రయించారు. బంతి, చామంతి, గులాబీ తదితర పూలను కిలో రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయించారు. ఇక బాణసంచాపై జీఎస్టీ తగ్గించకపోవడంతో దానిని సాకుగా చూపి వ్యాపారులు అధిక ధరలకు విక్రయించారు. లైసెన్స్ నంబర్, టిన్ నంబర్‌తో ఉన్న రశీదుపై బిల్లులు ఇవ్వలేదు. కానీ తెల్ల కాగితంపై రాసి ఇచ్చి పంపారు. కాగా ఆదివారం మధ్యాహ్నం నుంచి ముసురు వాతావరణం నెలకొనడంతో వినియోగదారులు బాణాసంచా దుకాణాల వద్దకు వెళ్లలేకపోయారు. దీంతో షాపులు వెలవెలబోయాయి. సోమవారం కూడా జిల్లా వ్యాప్తంగా వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొ నడంతో వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీపావళికి బాణసంచా కాల్చడం ఆనవాయితీ కావడంతో చివరి నిమిషంలోనైనా సరుకులు అమ్ముకోగలమని మరికొంతమంది ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు దీపావళి సందర్భంగా సోమవారం లక్ష్మీదేవిని పూజించుకునేందుకు జిల్లావాసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.

జీఎస్టీ సంస్కరణలతో ఊరట

- జేసీ యశ్వంత్‌కుమార్‌రెడ్డి

పార్వతీపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో మధ్య తరగతి కుటుంబాలకు భారీ ఊరట లభించిందని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం వాణిజ్యపన్నులశాఖ ఆధ్వర్యంలో ఐటీడీఏ గిరిమిత్ర హాల్‌లో 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' కార్యక్రమం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ సంస్కరణకు శ్రీకారం చుట్టిందన్నారు. జీఎస్టీ 2.0 వల్ల 99 శాతం వస్తువుల ధరలు తగ్గాయని వెల్లడించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా పాత, కొత్త ధరల్లో వ్యత్యాసాన్ని తెలుసుకోవచ్చని తెలిపారు. ఇటీవల కాలంలో ప్రజల కొనుగోళ్లు కూడా పెరిగాయన్నారు. అనంతరం విజేతలకు జ్ఞాపికలు అందించారు. ఐటీడీఏ, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

మూడు కిలోమీటర్లు నడిచి.. కొండలెక్కి..

- లొద్ద జలపాతం సందర్శించిన కలెక్టర్
- అభివృద్ధిపై అధికారులతో సమీక్ష

సాలూరు రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాట కాభివృద్ధికి కంకణం కట్టుకున్న కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి ఆదివారం లొద్ద జలపాతానికి వెళ్లారు. భారీ వర్షంలో తడుస్తూ మూడు కిలోమీటర్లు పైబడి నడిచి.. కొండలెక్కి ఆ ప్రాంతానికి చేరుకున్నారు. తొలుత ఆయన కారులో పార్వతీపురం నుంచి మక్కువ మండలం నంద వరకు వెళ్లారు. అక్కడ నుంచి అధికారులతో కలిసి జీపుల్లో లొద్దకు పయనమయ్యారు. వర్షాలకు ఆ మట్టి రోడ్డు పాడవ్వడంతో జీపులను మాసినవలస దాటిన తర్వాత నిలిపివేశారు. అక్కడి నుంచి కొద్ది దూరం బైక్‌పై కలెక్టర్ పయనమవగా.. అధికారులంతా కాలినడకన వెళ్తుండడంతో ఆయన కూడా నడకబాట పట్టారు. ఆ తర్వాత మూడు కిలోమీటర్లు నడిచి లొద్ద వద్దకు చేరుకున్నారు. అక్కడ గిరిజనులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల మంజూరుకు హామీ ఇచ్చారు. రోడ్డు నిర్మించి, అంబులెన్స్ అందుబాటులో ఉండేటట్టు చూడాలని గిరిజనులు కోరారు. వారు అందించిన రాగి సంకటి, అంబలిని కలెక్టర్ తిన్నారు. అనంతరం ఆయన మరో రెండు కిలో మీటర్లు వరకు నడిచి లొద్ద జలపాతానికి చేరుకుని అక్కడ స్నానం చేశారు. ఆ తర్వాత లొద్ద చేరుకుని అధికారులతో సమీక్షించారు. పర్యాటకంగా ఈ ప్రాంతం అభివృద్ధి చేస్తే గిరిజనులకు ఉపాధి లభిస్తుందన్నారు. సాయంత్రం వర్షం తగ్గిన తర్వాత తిరుగు పయనమయ్యారు.





లొద్ద జలపాతం వద్దకు వెళ్తున్న కలెక్టర్, ఇతర అధికారులు , జలకాలాడుతూ..

పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

6లో

అంకులవలసలో గజరాజులు

కొమరాడ, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): నిన్నమొన్నటి వరకు పార్వతీపురం మండలంలో హల్‌చల్ చేసిన గజరాజులు తాజాగా కొమరాడలో అడుగుపెట్టాయి. ఆదివారం ఆ మండలంలోని అంకులవలస గ్రామ పరిసరాల్లో సంచరించాయి. దీంతో ఆ ప్రాంతవాసులు బెంబేలెత్తిపోతున్నారు. చేతికందొచ్చిన పంటలు ఏమవుతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. తక్షణమే ఈ ప్రాంతం నుంచి వాటిని తరలించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. మరోవైపు అటవీశాఖ సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఎవరూ ఒంటరిగా బయట సంచరించకూడదని, ఏనుగులకు కవ్వించరాదని సూచిస్తున్నారు.



అంతర్గత భద్రతలో అలుపెరగని పోరాటం

- అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి
- రేపు పోలీసు అమరవీరుల దినోత్సవం

6లో

ఎముకలు గుల్లబారుతున్నాయ్

- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం

6లో

- అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి
- రేపు పోలీసు అమరవీరుల దినోత్సవం

అంతర్గత భద్రతలో.. అలుపెరగని పోరాటం



విజయనగరం క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి)

దేశ సరిహద్దు రక్షణ, అంతర్గత భద్రతే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వహిస్తున్నారు. విధి నిర్వహణలో ఎటువంటి ఒడిదుడుకులు ఎదురైనా ముందుకువెళ్తున్నారు. సరిహద్దులో శత్రువులతో జరిగే పోరులో వందలాది మంది ప్రాణాలొదిలిన విషయం విదితమే. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోనూ పోలీసుల బలగాలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఈక్రమంలో ఎందరో అమరులయ్యారు. వారి పోరాట పటిమ దేశ పౌరులందరికీ ఆదర్శంగా నిలుస్తోంది. వారి త్యాగాలు వెలకట్టలేనివి. 1959 అక్టోబరు 21న హిమాలయాల్లోని అక్సాహిచిన్ ప్రాంతంలో గస్తీ తిరుగుతున్న పదిమంది సీఆర్‌పీఎఫ్ జవాన్లను శత్రుదేశం హతమార్చింది. అప్పటి నుంచి దేశభద్రతకు ప్రాణత్యాగం చేసిన అమరవీరులను త్యాగాలు స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహిస్తున్నారు.

మందుపాతర పేలి..



1993లో శ్రీరాములు సివిల్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. 2001 ఫిబ్రవరిలో మావోయిస్టులు కురుపాం మండలంలోని లోవలక్ష్మీపురం గ్రామంలో కానిస్టేబుల్‌ని గాయపరిచి వాహనాన్ని దగ్ధం చేశారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఉన్నతాధికారుల ఆదేశాలతో సంఘటన స్థలానికి పోలీసు బృందంతో కలిసి వెళ్తుండగా, మావోయిస్టులు పేల్చిన మందుపాతరతో పోలీసు వాహనం ధ్వంసమయ్యింది. ఈ బృందంలో సభ్యులుగా ఉన్న శ్రీరాములతోపాటు డ్రైవర్ ఇస్మాయిల్ కూడా తీవ్రంగా గాయపడి, సంఘటన స్థలంలో మరణించారు.

మావోయిస్టుల కాల్పుల్లో..



పోలీసుశాఖలో రిజర్వు ఇన్‌స్పెక్టరుగా 1985లో ముద్దాడ గాంధీ ప్రవేశించారు. ఆయన సేవలను గుర్తించిన ప్రభుత్వం అనతికాలంలోనే 1991లో సివిల్ విభాగానికి బదిలీ చేసింది. ఉమ్మడి విజయనగరం జిల్లాలోని కొమరాడ పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐగా బాధ్యతలు నిర్వహించిన సమయంలో కొప్పడంగి అటవీప్రాంతంలో మావోయిస్టుల సమావేశమవుతున్నారన్న కీలక సమాచారాన్ని సేకరించి, ఉన్నతాధికారులకు అందించారు. 1998 ఆగస్టు 8న కూబింగ్ ఆపరేషన్ చేపట్టిన పోలీసులు మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనాయకులను అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా, వారు పోలీసులపై కాల్పులు జరిపారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో మావోయిస్టు పార్టీ తొమ్మిది మంది అగ్రనాయకులను కోల్పోయింది. అప్పటి నుంచి ప్రతీకారం తీర్చుకునేందుకు ముద్దాడ గాంధీని లక్ష్యంగా చేసుకున్నారు. సాలూరు సీఐగా ఉండగా 2001 ఆగస్టు 28న సాలూరు న్యాయస్థానంలో ఓ కేసుకి సంబంధించి సాక్ష్యం చెప్పేందుకు వెళ్లిన గాంధీ, ఆయన అంగరక్షకుడు కానిస్టేబుల్ చిరంజీవిపై కాల్పులు జరిపారు. ఆ కాల్పుల్లో ఇన్‌స్పెక్టరు ముద్దాడ గాంధీ, కానిస్టేబుల్ చిట్టిపంతుల చిరంజీవులు నెలకొరిగి, అమరుడయ్యాడు.

మావోయిస్టులు మాటువేయగా..



ఏఆర్ కానిస్టేబుల్‌గా షేక్ ఇస్మాయిల్ 1966లో ఉద్యోగం సాధించారు. అనంతరం ఎంటీ విభాగంలో సీనియర్ డ్రైవర్‌గా విధులు నిర్వహించారు. 2001 ఫిబ్రవరి ఒకటో తేదీన మావోయిస్టులు కురుపాం మండలంలోని లోవలక్ష్మీపురం గ్రామ శివార్లలో కానిస్టేబుల్‌ని గాయపరిచి, ఆయన వాహనాన్ని దగ్ధంచేశారు. ఈ సంఘటన జరిగిన తర్వాత ఉన్నతాధికారుల ఆదేశాలతో పోలీసు బృందాలను తీసుకుని పోలీసు వాహనంలో బయలుదేరి వెళ్తుండగా, మావోయిస్టులు మాటు వేసి మందుపాతర పేల్చి, పోలీసు వాహనాన్ని పేల్చేశారు. ఆ సంఘటనలో పోలీసు వాహనానికి డ్రైవర్‌గా వున్న ఇస్మాయిల్‌తో పాటు శ్రీరాములు కూడా తీవ్రంగా గాయపడి సంఘటన స్థలంలోనే ఇద్దరు అమరులయ్యారు.

కూంబింగ్ నిర్వహిస్తుండగా..



1993లో పోలీసు కానిస్టేబుల్‌గా సూర్యనారాయణ విధుల్లో చేరారు. స్పెషల్ పార్టీ పోలీసులతో కలిసి 2003 మే 30న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహిస్తుండగా, మావోయిస్టులు మాటు వేసి, పెద్దింటిజోడి గ్రామం వద్ద మందుపాత్ర పేల్చారు. ఆ ఘటనలో సూర్యనారాయణ తీవ్రంగా గాయపడి అమరులయ్యారు.

విజయనగరంలో కుండపోత వర్షం

- అవస్థలకు గురైన దీపావళి సామగ్రి విక్రేతలు, వినియోగదారులు

విజయనగరం రూరల్/టౌన్, అక్టోబరు 19 ఆంధ్రజ్యోతి): విజయనగరంలో శనివారం అర్ధరాత్రి, ఆదివారం కుండపోత వర్షం కురిసింది. ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించిన సమయంలో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. నగరంలోని కేఎల్‌పురంలో దీపావళి పురస్కరించుకుని సామగ్రి విక్రయించేందుకు షాపులు ఏర్పాటుచేసిన ప్రాంతంలో వర్షం నీరుచేరడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులకు గురయ్యారు. రోడ్డు పక్కన ఏర్పాటుచేసిన చిన్నపాటి దుకాణాల వద్ద నీరు చేరడంతో షాపులను మూసేయాల్సివచ్చింది. మందుగుండు సామగ్రి కొంతమేర తడిసిపోవడంతో చిరువ్యాపారులు లబోదిబోమంటున్నారు. వీరంతా హోల్‌సేల్ వ్యాపారులు వద్ద సరుకును తీసుకుని రిటైల్‌గా కేఎల్‌పురం ప్రాంతంలో చిన్నపాటి దుకాణాలు ఏర్పాటుచేసుకుని రెండు రోజుల పాటు వ్యాపారం సాగిస్తుంటారు.



షాపుల చుట్టూ చేరిన వర్షం నీరు



వర్షం కురుస్తుండడంతో సామగ్రిపై టార్పాలిన్ కప్పుతున్న నిర్వాహకులు

నిలకడగా నాగావళి

గరుగుబిల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి సాగునీటి ప్రాజెక్టు పరిధిలోని నాగావళిలో వరదనీటి ప్రవాహం నిలకడగా ఉంది. ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి నదిలోకి 3 వేల క్యూసెక్కుల వరద ప్రవాహం చేరింది. స్పిల్‌వే గేట్లు నుంచి దిగువకు 2,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే ప్రధాన కాలువల నుంచి సాగునీరును 1,300 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టులో 105 మీటర్లకు గాను 104.23 మీటర్ల నిల్వ సామర్థ్యం నెలకొంది. అల్ప పీడనం కారణంగా వర్షాలు కురుస్తున్న దృష్ట్యా ప్రాజెక్టు పరిధిలో అధికారులు అప్రమత్తమయ్యారు. వరద ప్రవాహం అధికమైతే దిగువకు మళ్లించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని ప్రాజెక్టు జేఈ బి.కిశోర్‌కుమార్, ఆపరేటర్ కెంగువ రామకృష్ణ తెలిపారు.



స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేసిన వరద ప్రవాహం

న్యాయం చేసే వరకు పండుగలను చేసుకోం

- బొడ్డవర వద్ద కొనసాగుతున్న జిందాల్ నిర్వాసితుల రిలే దీక్షలు

ఎస్.కోట రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిందాల్ కంపెనీ నుంచి ప్రభుత్వం న్యాయం చేసే వరకు పండుగలు చేసుకోబోమని నిర్వాసితులు తేల్చిచెప్పారు. ఆదివారం మండలంలోని బొడ్డవర గ్రామం వద్ద రిలే దీక్ష కొనసాగించారు. ఈ సందర్భంగా జిందాల్ నిర్వాసితులు మాట్లాడుతూ 121 రోజులుగా శాంతియుత పోరాటంచేస్తున్న పట్టించుకోలేదని, అధికారులు, యాజమాన్యం తమను నమ్మించి గొంతు కోసిందని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ భూములు తమకు వెనక్కి ఇప్పించాలని కోరారు. తిరిగి తమ నుంచి సేకరించి అందులో పరిశ్రమలు ఏర్పాటుచేసి తమ కుటుంబాలకు ఉద్యోగ, ఆర్థిక భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న నిర్వాసితులు



పైడిమాంబ భక్తుల ఆధ్వర్యంలో కలశజ్యోతిని ఊరేగిస్తున్న దృశ్యం

పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు

విజయనగరం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): విజయనగరంలో సిరులతల్లి పైడిమాంబ కలశ జ్యోతి ఊరేగింపు కార్యక్రమం పైడిమాంబ దీక్షాదారుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మాలధారణ చేసిన వారితో పాటు పైడిమాంబ భక్తులు రైల్వే స్టేషన్ రోడ్డు లోగల వనంగుడి నుంచి కలశ ఊరేగింపు ప్రారంభించారు. వైఎస్సార్ జంక్షన్, ఎన్‌సీఎస్ రోడ్డు, డాబాగార్డెన్స్ రోడ్డు, కన్యకాపరమేశ్వరీ ఆలయం, గంట స్తంభం మీదుగా మూడులాంతర్ల వద్ద గల చదురుగుడి వరకూసాగింది. దీక్షాదారులు పైడిమాంబ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

22న జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

భోగాపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): భోగాపురం జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 22న జిల్లా స్థాయి అండర్-17 బాలబాలికల వాలీబాల్ క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సింగిడి నాగన్న ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 21న విజయనగరం డివిజన్ స్థాయి అండర్-17 బాలికల వాలీబాల్ పోటీలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందులో భోగాపురం, డెంకాడ, పూసపాటిరేగ, విజయనగరం, గంట్యాడ, బొండపల్లి, ఎస్.కోట, ఎల్.కోట, వేపాడ, జామి, కొత్తవలస మండలాల విద్యార్థులు పాల్గొంటారని తెలిపారు. డివిజన్ స్థాయి క్రీడా పోటీల్లో ఎంపికైన బాలబాలికలు ఈనెల 22న భోగాపురం హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహించే జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి పోటీల్లో విజయనగరం, చీపురుపల్లి, బొబ్బిలి, పార్వతీపురం డివిజన్‌లకు చెందిన జట్లు పాల్గొంటాయని తెలిపారు.

జిల్లా స్థాయి పోటీలకు సోంపురం విద్యార్థుల ఎంపిక

వేపాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండల స్థాయి స్కూల్ గేమ్స్‌లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయి గేమ్స్‌కు సోంపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు గోవిందరావు శిక్షణలో అండర్-14 బాలుర విభాగంలో కబడ్డీలో వి.సుదీర్, టి.రోహిత్, ఖోఖోలో హెచ్.దిలీప్, వై.రోహిత్, యోగాలో వివేక్, రన్నింగ్‌లో సీహెచ్ చక్రి, హైజంప్‌లో డి.చైతన్య, అండర్-17 విభాగంలో జావెలిన్ త్రోలో ఎన్.అజయ్, హైజంప్‌లో బి.ఎర్నాయుడు, లాంగ్ జంప్‌లో ఆర్.ఎర్నాయుడు, రన్నింగ్‌లో కె.నవీన్, బాలికల విభాగంలో యోగాలో గీతిక, హర్షిత, ఖోఖోలో వర్షిణి ఎంపికయ్యారని పాఠశాల హెచ్ఎం బీపీఏ రాజు వివరించారు.


ఎముకలు గుల్లబారుతున్నాయ్

- నేడు ప్రపంచ ఆస్టియోపోరోసిస్ దినోత్సవం

విజయనగరం రింగురోడ్డు/ రాజాం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మనిషికి ఆకారాన్ని ఇచ్చేది, నిలబెట్టేది ఎముకలే. వయస్సు పైబడడం వల్ల ఎముకలు బలహీనపడి విరుగుతున్నాయి. కొంతమందికి తుంటి ఎముకలు విరిగి మంచానికే పరిమితమవుతున్నారు. దీనికి కారణం ఎముకల్లో ఖాళీలు, రంధ్రాలు ఏర్పడడం. దీనిని సైలెంట్ కిల్లర్ డిసీజ్‌గా వైద్యులు చెబుతున్నారు. ఆస్టియో పోరోసిస్ అంటే ఎముకలు గుల్లబారడం. ఆస్టియో అంటే ఎముక, పోరోసిస్ అంటే రంధ్రాలు.. అంటే ఎముకల్లో ఖాళీలు, రంధ్రాలు ఏర్పడి బలహీనపడడం. ఈ వ్యాధిలో ఎముక సాంద్రత తగ్గిపోతుంది. ఫలితంగా అవి లోపల స్పాంజిలా మారి విరిగే అవకాశాలు ఉంటాయి. సాధారణంగా ఎముకల నిర్మాణం, ఎదుగుదలలో భాగంగా ఎముకల్లోని పాత కణాలు పోయి కొత్త కణాలు చేరుతాయి. దీనినే రీమాడలింగ్ అంటారు. ఈ ప్రక్రియ చిన్నతనంలో మొదలై, కౌమారదశ వరకూ అతి వేగంగా ఉండి, దాదాపు 30 ఏళ్ల వయస్సు వచ్చే వరకూ పూర్తిస్థాయికి చేరుతుంది. ఈ దశలో కొత్త కణాలు ఎక్కువగా ఉండి ఎముక ధృడంగా ఉంటుంది. దీని తర్వాత క్రమేణా కొత్త కణాలు చేరడం తగ్గుతుంది. తద్వారా 50 ఏళ్ల వచ్చేసరికి ఎముక సాంద్రత తగ్గి గుల్లబారుతుంది. ఇది ఆస్టియో పోరోసిస్‌కు దారితీస్తుంది. ఎముకలు బోలుగా అవుతాయి, పెలుసుబారుతాయి. ఫలితంగా విరిగేముప్పు పెరుగుతుంది.

కారణాలు ఇవే..

కాల్షియం, విటమిన్ డి లోపం, సూర్యరశ్మి తక్కువగా తగలడం, శారీరక వ్యాయామ లోపం, మద్యం, పొగతాగడం, మహిళల్లో మోనోపాజ్ తర్వాత హార్మోనుల్లో మార్పులు, స్టిరాయిడ్ దీర్ఘకాలిక వినియోగం వల్ల ఆస్టియోపోరోసిస్ ఎక్కువగా వచ్చే అవకాశం ఉంది.



లక్షణాలు మొదట్లో కనిపించవు..

ఆస్టియోపోరోసిస్‌ను నిశ్శబ్ద వ్యాధి అంటారు. దీనికి కారణం మొదటి దశలో ఎలాంటి నొప్పి గానీ హెచ్చరికలు గానీ కనిపించవు. హఠాత్తుగా ఎముకలు విరిగే అవకాశం ఉంది. ఆస్టియోపోరోసిస్ ఫ్రాక్చర్లు, గుండెపోటుతో పోల్చితే, రెండింతలు ఎక్కువ. ముఖ్యంగా తుంటి ఎముక విరిగి మంచాన పడుతుండడం విచారకరం.

- తరచుగా వెన్నునొప్పి, నడుంనొప్పి, నడుం ఒంగిపోవడం, చిన్నగా పడిపోతే ఎముకలు విరగడం, చేతులు, తొడలు, వెన్ను ఎముకల్లో బలహీనతలు కలగవచ్చును. అలాగే కండరాల మోతాదు తక్కువగా ఉండడం, బలహీనంగా, బక్కపల్చగా ఉండడం ఎముక క్షీణతకు దారితీస్తుంది. ప్రధానంగా లావుగా ఉండేవారి కంటే సన్నగా ఉండేవారిలో ఆస్టియోపోరోసిస్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని వైద్యులు చెబుతున్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి..

రాగులు, జొన్న, బియ్యం మిశ్రమాలు, పాల ఉత్పత్తులు, సోయాబీన్, నువ్వులు, బాదం, అల్లం, ఉసిరి, కరివేపాకు, వైద్యుల సూచనలతో విటమిన్ డీ సంప్లిమెంట్స్, ప్రతిరోజు ఉదయం 15 నుంచి 20 నిమిషాలు సూర్యరశ్మి తగిలే చోట నడవడం ద్వారా ఆస్టియోపోరోసిస్ నివారించవచ్చును. అలాగే మద్యం, పొగాకు వినియోగం, సోడా, కోలా వంటి డ్రింక్స్, కాఫీ, టీ, ఉప్పు అధికంగా ఉండే ఆహారాలు తగ్గించాలి.

- ఎముక బలాన్నికొలిచే బోన్ డెన్సిటీ పరీక్ష (డెక్సాస్ స్కాన్) సంవత్సరానికి ఒకసారి చేయించుకోవాలి.
- సాధారణ వ్యాయామాలతో పాటు సూర్య నమస్కారాలు, యోగా, జీవనశైలిలో మార్పులు వంటివి చేసుకోవాలి.



ఎముక విరిగేంత వరకూ తెలియదు..



ఆస్టియో పోరోసిస్ లక్షణాలు తొందరగా పైకి కనిపించవు. అశ్రద్ధ చేస్తే ఫ్యాక్చర్లు జరిగే సమస్య ఎక్కువగా ఉంది. సాధారణంగా ఆస్టియోపోరోసిస్‌లో ఎముక విరిగేంత వరకూ గుల్లబారిన సంగతే తెలియదు. ఆస్టియోపోరోసిస్ చికిత్సలో కాల్షియం, విటమిన్ డీ, ఎముక విచ్ఛిన్నతను ఆపే కొత్త ఎముకను ఏర్పరిచే ఔషధాలు ఇవ్వవలసి ఉంటుంది. వైద్యుల పర్యవేక్షణలో తగిన చికిత్స తీసుకోవాలి. ఆస్టియోపోరోసిస్‌కు నేడు ఆధునాతన వైద్య చికిత్సలు అందుబాటులో ఉన్నాయి. ప్రతిఒక్కరూ ఏడాదికి ఒకసారి బోన్ డెన్సిటీ పరీక్ష చేసుకోవడం ద్వారా ఎముక సాంద్రత ఎంత ఉందో తెలుస్తుంది.

-డా.మోపాడ ప్రవీణ్‌కుమార్, ఆర్థోపెడిక్ సర్జన్, విజయనగరం



బాణసంచా ఆరుబయటే కాల్చాలి

- మామిడిపల్లి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి ఉమాశంకర్

సాలూరు రూరల్/గరుగుబిల్లి/రాజాం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పురస్కరించుకుని ఆరుబయట కళ్లజోళ్లను ధరించి బాణసంచా కాల్చాలని మామిడిపల్లి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి మీసాల ఉమాశంకర్ సూచించారు. ఇంటిల్లపాది ఆనందోత్సవాల మధ్య జరుపుకొనే దీపావళిలో అనుకోని ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని తెలిపారు. ఈ ప్రమాదాల్లో బాధితులు ఎక్కువగా కంటిచూపును కోల్పోతున్నారని పేర్కొన్నారు. బాధితులు ఏమరుపాటుగాఉండే అంధులుగామారే అవకాశముంటుందని తెలిపారు.

ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలు..

- టపాసులు కాల్చేటప్పుడు బిగుతుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి.
- పిల్లలు పెద్దల సమక్షంలో టపాసులు కాల్చాలి.
- ఎల్లప్పుడూ ఇంటి బయట టపాకాయలు వెలిగించాలి.
- సగం కాలిపోయిన, కాలిపోని టపాసులను నీరులేదా పొడి ఇసుకతో ఆర్పివేయాలి.
- గుడిసెలు, గడ్డివాములు, పెట్రోల్ బంకులకు దూరంగా బాణసంచా కాల్చాలి.
- ఫైర్ క్రాకర్లను గట్టి ఉపరితలంపై ఉంచి వెలిగించండి.
- ఏదైనా క్రాకర్స్ వెలిగించే సమయంలో తలను పక్కకు తిప్పి విష వాయువులను పీల్చకుండా ఉండడానికి నిలబడి ఉండాలి.
- దుస్తులు అగ్నికి ఆహుతైతే మెల్లగా నేలపై పడి దొర్లాలి.
- అగ్గి పెట్టెలు, ఓపెన్‌లైట్లు, గ్యాస్‌లైటర్లు, తదితర వాటికి ఎల్లప్పుడూ ఫైర్ క్రాకర్లను దూరంగా ఉంచాలి.
- టపాసులు కాల్చే ప్రాంతంలో రెండు బకెట్లు నీటిని ఉంచాలి.
- వంటింట్లో, పూజగదిలో బాణసంచాను ఉంచరాదు. బాణసంచా కాల్చే సమయంలో ఇంట్లో గ్యాస్ సిలిండర్ ఆఫ్ చేయాలి.
- గాయపడితే వెంటనే వైద్యసాయం పొందాలి.

ఇరుకు దారిలో ప్రయాణించేదెలా?

- ప్రమాదాలకు నిలయంగా కావలి-వాల్తేరు రహదారి
- జంగిల్ క్లియరెన్స్ చేయని వైనం

సంతకవిటి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఇరుకుగా మారిన దారి.. ఎదురుగా వచ్చిన వాహనాలు కనిపించక ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు. ఎటువంటి చర్యలు తీసుకోని అధికారులు. ఇదీ సంతకవిటి మండల పరిధిలోని వాల్తేరు, కావలి గ్రామాల మధ్య ఉన్న రహదారి పరిస్థితి. ఈ రహదారికి ఇరువైపులా పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎదురుగా వచ్చే వాహనాలను గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. మలుపుల వద్ద మరింత ప్రమాదకరంగా ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారి గుండానే శ్రీకాకుళం-పనసపేట పోయే బస్సు నడుస్తుంది. మొక్కలు దట్టంగా రోడ్డుకు ఇరువైపులా పెరిగిపోవడంతో బస్సు అద్దాలు పగిలిపోయే అవకాశం ఉందని, ఎదురుగా వచ్చే వాహనాలు కనబడకపోవడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని బస్సు డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే అధికారులు స్పందించి రహదారికి ఇరువైపులా ఉన్న జంగిల్‌ను క్లియర్ చేసేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



జంగిల్ క్లియరెన్స్ చేయకపోవడంతో ఇరుకుగా మారిన కావలి-వాల్తేరు రహదారి

సురక్షితంగా దీపావళి జరుపుకోవాలి

విజయనగరం క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలు ఆనందంగా, సురక్షితంగా కుటుంబ సభ్యులతో దీపావళి పండుగను జరుపుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిల్లలు, పెద్దలతో మతాబులు కాల్చే సమయంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఆనందంగా గడిపే సమయాన్ని విషాదంగా మార్చుకోవద్దని తెలిపారు. పెద్దల పర్యవేక్షణలో పిల్లలు మతాబులు కాల్చాలని ఆయన సూచించారు. ఏదైనా ప్రమాదం జరిగినట్టయితే సమీప అగ్నిమాపక కార్యాలయ సర్వీసు నెంబరు 101కు గానీ పోలీసు కంట్రోల్ రూం నెంబరు 112/100కి సమాచారం అందించాలని తెలిపారు.

అందరి జీవితాల్లో వెలుగులు నిండాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు దీపావళి పండుగ లక్ష్మీదేవి చల్లని చూపుతో అష్ట ఐశ్వర్యాలు సిద్ధించాలని జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అమావాస్య నాటి కారుచీకటిని తొలగించడానికి దీపాలతో వెలుగులు నింపడం దీపావళి ఉద్దేశమన్నారు. ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని, శాంతి, సౌభాగ్యం చేకూర్చాలని ఆయన ఆకాంక్షించారు.

నేడు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

శృంగవరపుకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): లక్కవరపుకోటలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేయనున్నట్టు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ చెక్కులు అందుకోనున్న 43మంది లబ్ధిదారులకు సమాచారం అందించామని చెప్పారు. వారంతా ఉదయం 9 గంటల లోపు క్యాంపు కార్యాలయానికి రావాలని ఆమె కోరారు.

కళాకారుడి కుటుంబానికి చేయూత

రాజాం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బొద్దాం గ్రామంలో ఇటీవల మృతిచెందిన ప్రముఖ కళాకారుడు బాలకృష్ణ కుటుంబానికి చీమకుర్తి కళాపీఠం ఆర్థికంగా అండగా నిలిచింది. బొద్దాం గ్రామంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమలో కళాపీఠం అధ్యక్షుడు లింగమూర్తి, ఉత్తరాంధ్ర కళా పరిషత్ కార్యదర్శి మారుతీప్రసాద్, కిట్టలపాడు శ్రీను తదితరుల ఆధ్వర్యంలో బాలకృష్ణ భార్య కొండమ్మకు రూ.25వేలు అందజేశారు. ఈ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

చీపురుపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జి.అగ్రహారంలో పైడితల్లి అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం ప్రముఖ న్యాయవాది కరణం మురళీమోహనరావు, దశలక్ష్మి దంపతులు రూ.25వేల నగదు, వంద బస్తాల సిమెంటును అందజేశారు. నిర్మాణ కమిటీ విజ్ఞప్తి మేరకు ఆదివారం వారు వీటిని కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పతివాడ శ్రీనివాసరావు (గుంటూరు శ్రీను), ఏజీపీ మండల సూర్యనారాయణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తం ఉండాలి

చీపురుపల్లి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): వ్యాధుల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు సూచించారు. మానవీయత సంస్థ ఆధ్వర్యంలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆదివారం జరిగిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని, రోగులకు మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత, పౌష్టికాహారం వల్ల వ్యాధులను దూరంగా ఉంచవచ్చునన్నారు. మానవీయత సంస్థ అధ్యక్షుడు బీవీ గోవిందరాజులు, ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు పాల్గొన్నారు.

మంత్రికి ఘన స్వాగతం



మంత్రి దుర్గేష్‌ను సత్కరిస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

భోగాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆదివారం రాజాం పర్యటనకు వచ్చారు. ఈయన భోగాపురం జాతీయ రహదారి గుండా వస్తున్న సమయంలో మార్గమధ్యంలో స్థానిక జనసేన పార్టీ కార్యాలయం వద్ద నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి స్వాగతం పలికారు. ఆయనకు దుస్సాలువ కప్పి, స్వీట్ బాక్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పల్ల రాంబాబు, వందనాల రమణ, బొల్లు త్రినాథ్ పాల్గొన్నారు.

కనీస పెన్షన్ అమలు చేయాలి

రాజాం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): గతంలో ఇచ్చిన హామీని ఎన్‌డీఏ ప్రభుత్వం అమలు చేయడం ద్వారా ఈపీఎఫ్ పెన్షనర్లకు కనీస పెన్షన్‌ను రూ.9వేలు చెల్లించాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామ్మూర్తి నాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాజాంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వేలాది మంది కార్మికులకు నెలకు రూ.1000 పెన్షన్ వస్తోందని.. ఈ మొత్తం వృద్ధాప్యంలో ఏమూలకూ సరిపడదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తెరిగి వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో పలువురు పెన్షనర్లు పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

జామి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఎవరైనా అక్రమంగా బాణసంచా విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ వీరజనార్దన్ హెచ్చరించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. లైసెన్స్ లేకుండా బాణసంచా అమ్మకాలు వద్దని ఇప్పటికే చెప్పామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు.

ఓం సదనంలో ప్రత్యేక పూజలు



108 శివలింగాలకు పూజలు చేస్తున్న దృశ్యం

కొత్తవలస, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మికాపల్లి గేట్ సమీపంలోనున్న ఓం సదనంలో ఆదివారం ఆశ్వీయుజ మాస శివరాత్రి సందర్భంగా 108 శివలింగాలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకాలను నిర్వహించారు. రాష్ట్ర అర్చక, పురోహిత సంఘం ప్రతినిధి అంపోలు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు. సదనం అర్చకుడు అంపోలు కిరణ్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

జిందాల్ నిర్వాసితులపై నిర్లక్ష్యం తగదు

- ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జగన్

వేపాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): శృంగవరపుకోట మండలంలోని జిందాల్ భూనిర్వాసితుల సమస్యపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన వేపాడలో మండల గిరిజన నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎస్.కోట మండలం బొడ్డవర ప్రాంతంలో అల్యూమినియం ఫ్యాక్టరీ వస్తే తమ బతుకులు మారుతాయని ఆ ప్రాంతం చుట్టూ ఉన్న ఐదు పంచాయతీల దళిత, గిరిజన ప్రజలు వారికి ఉన్న కొద్దో గొప్పో భూములను జిందాల్ యాజమాన్యానికి ఇవ్వగా, ఆ కంపెనీ యాజమాన్యం వారిని మోసం చేసిందన్నారు. ఇన్ని రోజులుగా వారు పోరాటం సాగిస్తున్నా ప్రభుత్వం జిందాల్ పక్కన నిలబడడం దారుణమన్నారు. మారిక గిరిజనులు, మండల గిరిజన నాయకులు పాల్గొన్నారు.



ఆందోళన వ్యక్తం చేస్తున్న గిరిజన నాయకులు

క్రీడలు చదవుకు ఆటంకం కాదు: ఎమ్మెల్సీ

శృంగవరపుకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడలు చదవుకు ఆటంకం కాదని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. ఆదివారం శృంగవరపుకోట పుణ్యగిరి రోడ్డులోని పీఆర్ కోర్టులో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ బ్యాడ్మింటన్ ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రఘురాజు హాజరై, పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను అభినందించారు. ఉద్యోగ అవకాశాల్లో క్రీడాకారులకు ప్రభుత్వం 3శాతం కోటాను కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్.కోట మండలం చందులూరు జడ్పీ ఉన్నత పాఠశాల పీడీ పొట్నూరు శ్రీరాములు, మండల క్రీడా కోఆర్డినేటర్ తాత్రాజు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ఎమ్మెల్సీ రఘురాజు

సైన్స్ సెమినార్‌లో జాతీయ స్థాయికి భానుప్రసాద్

డెంకాడ, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అక్కివరం ఆదర్శ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పతివాడ భానుప్రసాద్ రాష్ట్ర స్థాయిలో జరిగిన సైన్స్ సెమినార్-2025లో విజేతగా నిలిచాడు. ఆంధ్రప్రదేశ్ నుంచి మొత్తం 52 మంది పోటీపడిన ఈ సెమినార్‌లో భానుప్రసాద్ ఒక్కడే జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈనెల 18న విజయవాడ లయోలా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎం.వెంకటకృష్ణరెడ్డి చేతులమీదుగా భానుప్రసాద్ ప్రశంస పత్రం అందుకున్నాడు. ఈసందర్భంగా విద్యార్థికి ఆదర్శ పాఠశాలల జేడీ థెరిసా సుల్తానా, డీఈవో మాణిక్యాల నాయుడులు అభినందించారు.

జిల్లా స్థాయి యోగా పోటీల్లో రామకృష్ణ ప్రతిభ

శృంగవరపుకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నెల్లిమర్ల శ్రీరామకృష్ణ మఠానికి చెందిన శ్రీవివేకానంద విద్యా వికాస్ కేంద్రంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో మాస్టర్ మెన్ గ్రూప్ సీ(50-60 వయస్సు)లో ఎస్.కోట పట్టణానికి చెందిన సెంటర్ ఫర్ యోగా మెడిటేషన్(సిమ్) సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ ప్రథమ స్థానంలో నిలిచారు. ఈనెల 25, 26న విశాఖపట్టణంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగా పోటీలోను పాల్గొనే అవకాశాన్ని పొందారు. ఏపీ యోగా అసోసియేషన్ నిర్వహించిన ఈ పోటీల్లో సబ్ జూనియర్ విభాగం (8-14 వయస్సు)లో పట్టణానికి చెందిన హృషికేష్, లాస్యలు ప్రతిభ చూపారు. ఈ విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు రామకృష్ణ తెలిపారు.



యోగా పోటీల్లో పాల్గొన్న రామకృష్ణ

అథ్లెటిక్స్‌లో షికారుగంజి విద్యార్థుల సత్తా

దత్తిరాజేరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): విజయనగరం విజ్జి స్టేడియం వేదికగా జరిగిన జిల్లా స్థాయి అండర్-19 అథ్లెటిక్స్ ఎంపికలో షికారుగంజి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఎ.ఆదిత్య, డి.పవన్, బి.రోహన్, డి.గిరి, టి.జాహ్నవి, బి.సాహితి, బి.లావణ్య, బి.స్వప్న, ఎం.యమున, ఎల్.అలేఖ్య, కె.కృష్ణవేణి, ఎ.అనూష, ఎస్.దుర్గా, జి.ఝాన్సీలు ప్రతిభ కనబరిచి.. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ ఎం.ఈశ్వరరావు అభినందించారు.



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

బాధితురాలికి సాయం

గరివిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): క్యాన్సర్ వ్యాధికి గురై హైదరబాద్‌లో బసవతారకం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జామి స్పందన అనే యువతికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె కుటుంబ సభ్యులకు గరివిడి జడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీను రూ.50వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఆదివారం గరివిడి వచ్చిన మాజీ ఎంపీ బొత్స ఝాన్సీ చేతులమీదుగా శ్రీను ఈ ఆర్థికసాయం అందజేశారు.

సమ్మెకు దిగిన మైనింగ్ కార్మికులు

గరివిడి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వాం పంచాయతీ పరిధిలో గల డీఎఫ్ఎన్‌లో మైనింగ్ కార్మికులు ఆదివారం మెరుపు సమ్మెకు దిగారు. డీఎఫ్ఎంకు చెందిన ఆర్పీఎస్ దాస్ కంపెనీకి చెందిన దేవాడ, సదానందపురం, దువ్వాము తదితర మైనింగ్ కంపెనీలలో సుమారు గత 50 సంవత్సరాల నుంచి 261 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇటీవల సదరు పరిశ్రమకు మైనింగ్‌కు సంబంధించిన లీజులు కాలపరిమితి అయిపోయింది. దీంతో మైనింగ్‌లో పనిచేసిన 261 మంది కార్మికులను సెటిల్‌మెంట్ చేసి తొలగిస్తామని పరిశ్రమ యాజమాన్యం వారు అంటున్నారు. దీనికి కార్మికులు ససేమిరా అంటున్నారు. తిరిగి పరిశ్రమకు మైనింగ్ లీజులు వచ్చేంతవరకు వేచి ఉంటామని, లీజు అనుమతులు పొందిన తర్వాత పనిలోకి వస్తామని కార్మికులు తమ యూనియన్ అయిన సీఐటీయూ నాయకుల ద్వారా యాజమాన్యానికి విన్నవించుకున్నారు. ఈ సమస్యపై గత కొంతకాలంగా యాజమాన్య వర్గాలకు, సీఐటీయూ నాయకులకు పలు దఫాలుగా చర్చలు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా యాజమాన్యం వారు కార్మికుల అనుమతులు లేకుండా వారి బ్యాంకు అకౌంట్లలో సెటిల్‌మెంట్‌కు సంబంధించిన డబ్బులను జమచేశారు. విషయం తెలుసుకున్న మైనింగ్ కార్మికులు సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పరిశ్రమకు చెందిన డీఎఫ్ఎన్‌లో ఉన్న పరిశ్రమ ప్రధాన కార్యాలయం వద్ద మెరుపు సమ్మెకు దిగారు. ఎట్టి పరిస్థితిలోనూ తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే తమ పోరాటాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ ఆందోళన కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎ.గౌరినాయుడు, మైన్స్ నాయకులు అప్పలనాయుడు, పాపినాయుడు, రమణ, సన్యాసినాయుడు, వీరభద్రం తదితరులు నాయకత్వం వహించారు.



పరిశ్రమ కార్యాలయం వద్ద ఆందోళన చేపడుతున్న మైనింగ్ కార్మికులు

నిరుపయోగంగా ఫాగింగ్ యంత్రాలు

- గ్రామాల్లో దోమల స్వైరవిహారం
- ఇదీ బొబ్బిలి మండలంలో పరిస్థితి

బొబ్బిలి రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతాడ, మెట్టవలస, పారాది, చిత్రకోట బొడ్డవలస తదితర పంచాయతీల్లో నిర్వహణ లేకపోవడంతో ఫాగింగ్‌యంత్రాలు నిరుపయోగంగా మూలకు చేరాయి. గ్రామీణ ప్రాంతాల్లో దోమల నివారణకు స్వచ్ఛాంధ నిధులు లక్షలాది రూపాయలు వెచ్చించి కొనుగోలుచేస్తున్న ఫాగింగ్ యంత్రాలు గ్రామ సచివాలయ సిబ్బంది వినియోగించేందుకు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. వీటి వినియోగంపై పంచాయతీరాజ్‌శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఫాగింగ్ చేయడానికి చర్యలు తీసుకోవడంలేదన్న విమర్శలొస్తున్నాయి. వాస్తవానికి ఒక ఫాగింగ్ మిషన్ ద్వారా దోమల మందును పిచికారీ చేయాలంటే ఐదు లీటర్ల డీజిల్‌లోకి మిలాథియన్ 200 గ్రాములు, అబిట్ 200 మిల్లీ గ్రాములు ఉపయోగించాల్సి ఉంటుంది. వీటికి రూ. ఐదు వేల నుంచి రూ. పది వేల వరకు ఖర్చవుతుంది. ప్రతి రెండు నెలలకు ఒకసారి ఉపయోగించకపోతే ఫాగింగ్ యంత్రా లు పనిచేయవని అధికారులు చెబుతున్నారు. కాగా పరిశీలించి పంచాయతీ నిధులతో ఫాగింగ్ యంత్రాలను వినియోగంలోకి తీసుకొస్తామని ఎంపీడీవో పి.రవికుమార్ తెలిపారు.



సచివాలయంలో నిరుపయోగంగా ఉన్న యంత్రం

రైలు ఢీకొని యువకుడి మృతి

ఎస్.కోట రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఎస్.కోట పట్టణంలో స్థానిక రైల్వేస్టేషన్ నుంచి నడబంద గ్రామం వెళ్లే మార్గంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. పోతనపల్లి గ్రామానికి చెందిన పూడి గణేష్(30) విశాఖపట్నంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. అయితే శనివారం రాత్రి విధులు ముగించుకుని ఎస్.కోటకు వచ్చేసరికి ఆలస్యం అయింది. దీంతో ఆయన ఎస్.కోటలో ఉన్న తన ఇంట్లో రాత్రి పడుకున్నాడు. వేకువజాము సమయంలో బహిర్భూమికని రైలు పట్టాలు దాటి వెళ్తుండగా.. ఈ సమయంలో రైలు ఇంజన్ వచ్చి ఢీకొంది. దీంతో గణేష్ అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేశారు.

తొలగిన కంచె

జామి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అలమండ గ్రామంలో మైనార్టీలను ఇంట్లో నుంచి బయటకు రాకుండా వైసీపీ నేతలు ఇనుప కంచె వేసిన విషయంపై ఇటీవల ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమయ్యింది. దీనిపై పోలీసులు స్పందించారు. ఆదివారం మైనార్టీల ఇళ్లకు ఎదురుగా ఇనుప కంచెను తీయించారు. ఇరు వర్గాలవారిని స్టేషన్‌కు రప్పించి వివరాలు సేకరించారు. ఇకపై ఇలాంటి చర్యలకు దిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి

కొత్తవలస, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రైతులు దశలవారిగా రసాయనిక ఎరువుల వినియోగం తగ్గించాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) పీడీ ఆర్.శ్రీనివాసరావు సూచించారు. ఆదివారం చీడివలస గ్రామంలో వరి, అపరాల పంటల్లో సస్యరక్షణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని, రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన వ్యవసాయ శాఖాధికారులు లక్షణరావు, హరికృష్ణ, మండల వ్యవసాయ అధికారి కేవీ రాంప్రసాద్, సర్పంచ్ చలుమూరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

మొక్కలకు రక్షణ కల్పించాలి

రాజాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి సందర్భంగా పర్యావరణ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపడుతున్నామని.. వాటికి తగిన రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు కోరారు. ఆదివారం రాజాంలోని బొబ్బిలి రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆయన తోపాటు పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు, గోకవలస కృష్ణమూర్తి, రెడ్‌క్రాస్ ప్రతినిధులు కొత్త సాయిప్రశాంత్‌కుమార్, పెంకి చైతన్యకుమార్, రోటరీ క్లబ్ అధ్యక్షుడు గట్టి పాపారావు, రవి, శీమకుర్తి ప్రసాదరావు, రెడ్డి శ్రీనివాసరావు, శ్రీను పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న దృశ్యం

అమ్మవారికి వెండి వస్తువుల బహూకరణ

చీపురుపల్లి, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన కిల్లంశెట్టి సన్యాసిరావు, శోభ దంపతులు కనకమహాలక్ష్మి అమ్మవారికి వెండి పళ్లెం, గిన్నెలను కానుకగా ఇచ్చారు. రూ.1.8 లక్షలు విలువ చేసే ఈ వస్తువులను వారు ఆలయ ప్రాంగణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో కమిటీ చైర్మన్ గవిడి నాగారాజు, ఈవో ఎస్.నానాజీబాబులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మేము సైతం స్వచ్ఛంద సంస్థ సభ్యులు వి.రవీంద్రనాయుడు, బి.రామారావు, ఎస్వీజీ శ్రీనివాసరావు, సూరుకుమార్, పి.నరసింగరావు, గద్దే అనురాగ్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు వెండి వస్తువులను అందజేస్తున్న దృశ్యం

సత్యసాయికి ఘనంగా పూజలు




లక్ష సాయి గాయత్రీ జప యజ్ఞం నిర్వహిస్తున్న దృశ్యం

నెల్లిమర్ల, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి) జరజాపుపేటలో ఆ గ్రామ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం సామూహిక లక్ష సాయి గాయత్రీ జప యజ్ఞం ఘనంగా నిర్వహించారు. నల్లి సూరిబాబు స్మారక కళావేదికపై నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని సత్యసాయి సేవా విభాగం రాష్ట్ర వేదం కోఆర్డినేటర్ దుర్గాప్రసాద్ ప్రారంభించారు. వందమంది పేదలకు అమృత కలశాలను, దుప్పట్లను పంపిణీ చేశారు. సుమారు 300 మంది సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేత్ర దానం చేసి.. ఆదర్శంగా నిలిచి

రాజాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మునిసిపాల్టీ పరిధిలోని చీపురుపల్లి రోడ్డులో గల సాయినగర్‌కు చెందిన కోట్ల నారాయణరావు(60) ఆదివారం తన పుట్టినరోజున గుండెపోటుతో మృతిచెందారు. అయితే కుటుంబ సభ్యులు ఆయన నేత్రాలను దానం చేసి సమాజానికి ఆదర్శంగా నిలిచారు. నారాయణరావు భార్య అన్నపూర్ణ, కుమార్తె అమృత, కుమారుడు వరుణ్‌కుమార్ అంగీకారం మేరకు ఆయన కార్నియాను సేకరించామని రాష్ట్ర రెడ్‌క్రాస్ వైస్ చైర్మన్ పి.జగన్మోహన్‌రావు తెలిపారు. రాజాం రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్త సాయిప్రశాంత్‌కుమార్, జాతీయ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్యకుమార్, కోట్ల పార్థసారధి, కిషోర్, జగదీష్ పాల్గొన్నారు.

సందడిగా అ‘పూర్వ’ సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని కొత్తవలస కేపీఎం స్కూల్‌లో ఆదివారం 1993-94 టెన్త్ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం సందడిగా నిర్వహించారు. 22 ఏళ్ల అనంతరం తాము చదువుకున్న పాఠశాలకు పూర్వ విద్యార్థులు చేరుకుని ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని అలనాటి జ్ఞాపకాలను పంచుకున్నారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులు ఆర్.రాజారావు, అప్పారావు, జగన్నాథరావు, భాస్కరరావులను సత్కరించారు. కార్యక్రమంలో కేపీఎం పాఠశాల ప్రస్తుత హెచ్‌ఎం అప్పలనాయుడు పాల్గొన్నారు.

రైతు సేవా కేంద్రంలో మద్యం సీసాలు

భోగాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): భోగాపురం సచివాలయం సమీపంలో సగంలో నిలిచిన రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం అధ్వానంగా తయారయ్యిం ది. ఈ భవన నిర్మాణంలో కొందరు మద్యం తాగి అక్కడే సీసాలు పడేస్తున్నారు. దీంతో అవి పోగులుగా కనిపిస్తున్నాయి. కొందరు మేకలు, పశువులను ఇందులోనే ఉంచుతున్నారు. అధికారులు స్పందించి ఈ రైతు సేవా కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకు వచ్చేవిధంగా చూడాలని పలువురు కోరుతున్నారు.



ముసురుతో రైతుల ఇక్కట్లు

● మొక్కజొన్న, పత్తి పంటలు కాపాడుకునేందుకు పాట్లు



భామినిలో మొక్కజొన్న గింజలపై కప్పిన టార్పాలిన్లు

భామిని, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఆదివారం మధ్యాహ్నం ఒక్కసారి వాతావరణం మారింది. ఆ వెంటనే వర్షం కురిసింది. దీంతో భామిని, లివిరి, దిమ్మిడిజోల, బాలేరు, తాలాడ, ఘనసర తదితర గ్రామాలో మొక్కజొన్న, పత్తి రైతులు ఇబ్బంది పడ్డారు. పంటను రక్షించుకునేందుకు ఆపసోపాలు పడ్డారు. పంట తడిసి పోకుండా టార్పాలిన్లు కప్పారు. వారం రోజుల నుంచి మొక్క జొన్న గింజలను ఆరబెట్టినప్పటికీ కొనుగోలుదారులు రాకపోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇంతలో వాతావరణశాఖ దక్షిణ కోస్తాలో తుఫాన్ హెచ్చరిక జారీ చేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలోని నులకజోడు, సిగిడి, బిల్లు మడ, దిమ్మిడిజోల బాలేరు తదితర గ్రామాల్లో పంటను ఆరుబయటే టార్పాలిన్లు కప్పి ఉంచారు. వర్షం వల్ల గింజలకు ఏమాత్రం చెమ్మ తగిలినా అవి మొలకెత్తి కుళ్లిపోతాయని భయపడుతున్నారు. వాతావరణం అనుకూలించకపోవడంతో కొందరు రైతులు పంట కోత ను వాయిదా వేసుకున్నారు. దీపావళి తర్వాత సంబంధిత అధికారులు చొరవ చూపి కొనుగోలు చర్యలు చేపట్టాలని రైతులు కోరారు

జిల్లావ్యాప్తంగా వర్షం



సాలూరులో వర్షం కురుస్తున్న దృశ్యం

సాలూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సాలూరు పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం కురిసింది. ప్రత్తి, మొక్కజొన్న రైతులు అవస్థలు పడ్డారు. చేతికి అందిన పంటను కాపాడుకునేందుకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

●పాలకొండ, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): పాలకొండలో ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది. ఏకధాటిగా వర్షం కురవడంతో స్థానికులు, వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పాలకొండతో పాటు వీరఘట్టం, భామిని తదితర మండలాల్లోనూ ఆదివారం మధ్యాహ్నం వర్షం కురిసింది.

●సీతంపేట రూరల్, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఏజెన్సీలో ఆదివారం మధ్యాహ్నం నుంచి కుండపోత వర్షం కురిసింది. అల్పపీడన ప్రభావంతో మన్యం వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో మన్యంవాసులు ఇబ్బందులు పడ్డారు.అయితే ఈ అకాలవర్షాలకు పత్తిపంటకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని గిరిజన రైతులు ఆవేదన చెందుతున్నారు.

నేడు ఐటీడీఏ పీజీఆర్‌ఎస్ రద్దు

సీతంపేట రూరల్, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీడీఏ కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్‌ఎస్‌ను దీపావళి పర్వదినం సందర్భంగా రద్దు చేస్తున్నట్లు ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో పవార్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గిరిజనులు ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.

గ్రంథాలయాలను వినియోగించుకోండి

గరుగుబిల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖా గ్రంథాలయం నిర్వాహకులు నల్ల మధుసూదనరావు మాట్లాడుతూ గ్రంథాలయాల్లో విద్యార్థులకు ఉపయోగపడే పలు రకాల పుస్తకాలు ఉన్నాయన్నారు. వీటిని చదువుకోవాలని కోరారు.

విద్యార్థులకు రగ్గులు, బెడ్‌షీట్లు

బొబ్బిలి రూరల్, అక్టోబర19 (ఆంధ్రజ్యోతి): కలవరాయి, పిరిడి బీసీ సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థులకు ఆదివారం బీసీ సంక్షేమ శాఖ అధికారి శ్యామలాకుమారి రగ్గులు, బెడ్‌షీట్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చలికాలం కానున్న నేపథ్యంలో విద్యార్థులు రక్షణ పొందేందుకు నాణ్యత కలిగిన రగ్గులతో పాటు బెడ్‌షీట్లను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. కలవరాయి వసతి గృహంలో 112 మంది విద్యార్థులకు, పిరిడి వసతిగృహంలో 62 మంది విద్యార్థులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వసతిగృహ సంరక్షకుడు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

పిడుగు పడి ఆవు మృతి

తెర్లాం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): బొంగుపేటలో ఆదివారం సాయంత్రం పిడుగు పడి ఆవు మృతి చెందింది. వీఆర్వో రవికుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరిచర్ల ఆదినారాయణ ఆదివారం మధ్యాహ్నం ఆవును మేతకు తీసుకువెళ్లాడు. ఆవు పొలంలో మేస్తుండగా పిడుగు పడింది. దాంతో ఆవు అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై వీఆర్వో, వీహెచ్‌ఏ విజయ ఆవుకు పంచనామా నిర్వహించారు. ప్రభుత్వానికి నివేదిస్తామని వారు తెలిపారు.

విద్యార్థులు ఏకాగ్రతతో చదవాలి

రామభద్రపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఏకాగ్రతతో చదివి మంచి ఫలితాలు సాధించాలని స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వంగపండు గోపాలనాయుడు కోరారు. మండల కేంద్రంలోని ఎస్సీ వసతిగృహాన్ని ఆదివారం రాత్రి ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పాఠ్యాంశంపై విద్యార్థులు సమగ్రమైన అవగాహన పెంపొందించుకోవాలన్నారు. సబ్జెక్టులలో అనుమానాలను నివృత్తి చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల భోజనాలను పరిశీలించారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని విద్యార్థులు వండి వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకోండి

బొబ్బిలి, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పర్వదినాన్ని ప్రజలంతా కాలుష్యరహితంగా జరుపుకోవాలని స్థానిక రాజయోగ కేంద్రం ఇన్‌చార్జి బీకే రాజేశ్వరి పిలుపునిచ్చారు. స్థానిక బ్రహ్మకుమారి సేవాకేంద్రంలో ఆదివారం మట్టి జ్యోతులను వెలిగించి ఆమె మాట్లాడారు. ప్రకృతికి, సమస్త జీవరాశుల పరిరక్షణకు తోడ్పడతామని అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అజ్ఞానపు చీకట్లను పారదోలి జ్ఞాన జ్యోతులను వెలిగించి సత్యమైన దీపావళిని అందరూ జరుపుకోవాలని హితవు పలికారు. ●గాలి, శబ్ద కాలుష్యానికి తావులేని రీతిలో అందరూ హరిత దీపావళిని జరుపుకోవాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ ప్రజల జీవితాల్లో జ్ఞానాన్ని, ఆనందాన్ని నింపే దీపావళిని ప్రతీ ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు.

కూటమి ప్రభుత్వంతో పేదలకు అండ



చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

సాలూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పేదలకు అండగా ఉంటోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. ఆదివారం సాలూరులో ఆమె సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. పట్టణంలోని 21వ వార్డుకు చెందిన ఇమంది చిన్నమ్మలకు రూ.31,352, మక్కువ మండలంలోని తూరుమామిడికి చెందిన ఈదుబిల్లి త్రివేణికి రూ.40 వేలు, కాశీపట్నం గ్రామానికి చెందిన కోట శంకరనాయుడుకు రూ.43,584, మెంటాడ మండలంలోని పెదమేడపల్లి గ్రామానికి చెందిన రెడ్డి గణేశ్‌కు రూ.35 వేలు చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం చంద్రబాబు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా ప్రజలకు కలెక్టర్ శుభాకాంక్షలు

పార్వతీపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలకు కలెక్టర్ ఎస్.ప్రభాకర్‌రెడ్డి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన ప్రకటన విడుదల చేశారు. దీపావళి పండుగ చీకటిపై వెలుగు, చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అన్నారు. జిల్లాలోని ప్రతి ఇంటిలో సంతోషాన్ని, సంపదలు, సుఖశాంతులను నింపాలని ఆయన ఆకాంక్షించారు. శబ్ద, వాయు కాలుష్యం తక్కువగా ఉండే గ్రీన్ కాకర్స్‌ను వినియోగించాలని సూచించారు.

రజకులకు ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయచంద్ర

బెలగాం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం రజకులకు ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం పట్టణంలోని చాకలి బెలగాంలో రజకుల కమ్యూనిటీ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ ఆవిర్భావం నుంచి రజకులకు తగిన ప్రాధాన్యమిస్తోందన్నారు. వారిని చట్టసభల్లోకి పంపించిన ఘనత టీడీపీదేనన్నారు. రజకుల సేవాసంఘం ప్రతినిధులు కోరిన వెంటనే కమ్యూనిటీ భవన నిర్మాణానికి స్థలం కేటాయించానన్నారు. ఎమ్మెల్యే అయిన తర్వాత మొట్టమొదటిసారి వారికే స్థలం కేటాయించినట్టు చెప్పారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి తన వంతుగా రూ.లక్ష విరాళం ఇస్తానన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి నాయకులు, కార్యకర్తలు, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురు చేరిక

పట్టణంలోని 16వ వార్డులో వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో టీడీపీలో చేరారు. ఎమ్మెల్యే వారికి కండువాలు వేసి వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమం నచ్చి టీడీపీలో చేరినట్లు వారు చెప్పారు.

వచ్చేనెలలో వంతెన ప్రారంభిస్తాం

సీతానగరం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): మండలంలో సువర్ణముఖి నదిపై నిర్మిస్తున్న వంతెనను వచ్చేనెలలో ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. సువర్ణముఖిపై వంతెన పనులు శరవేగంగా జరగాలని ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించామన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం మాట నిలబెట్టుకుందన్నారు. అలాగే బూర్జలో సువర్ణముఖి నదిపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పెంట సత్యంనాయుడు, రౌతు గోపాల్‌నాయుడు, తెంటు వెంకట అప్పలనాయుడు, కె.అరవింద్‌కుమార్, పైల నాగభూషణం, బి.శ్రీనివాసరావు, టి.రామారావు, దామినేని భానుప్రసాద్, టి.శేఖర్, బి.సత్యనారాయణ, బి.చిరంజీవి, టి.రామారావు, ఎం.శంకరరావు, కొల్లి సురేష్ పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలు పరిష్కరించండి

గుమ్మలక్ష్మీపురం, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోని వైద్యుల సమస్యలను పరిష్కరించాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వ్యాధులు ప్రబలే సమయంలో వైద్యులు సమ్మె చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. తక్షణమే వైద్యుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. అలాగే విద్యుత్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

పాలకొండ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఏలాం సెంటర్‌లో ఆదివారం స్మార్ట్ రేషన్ కార్డులను టీడీపీ సీనియర్ నాయకుడు పల్లా కొండలరావు పంపిణీ చేశారు. స్మార్ట్ రేషన్ కార్డుతో రాష్ట్రం ఎక్కడైనా సరుకులు తీసుకునే అవకాశం ఉందన్నారు. అవినీతికి ఆస్కారం ఉండదని వివరించారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

గరుగుబిల్లి, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ షేక్ ఫక్రుద్దీన్ అన్నారు. ఎర్రన్నగుడి జంక్షన్‌లో ఆదివారం వ్యాపార సంస్థల యజమానులతో సైబర్ నేరాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసే విషయంపై షాపుల యజమానులతో చర్చించారు. సైబర్ నేరగాళ్లు కొత్త విధానాలతో మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ఫేక్ లోన్ యాప్‌ల ద్వారా సామాజిక మాధ్యమాల్లో లింక్‌లను పంపి ఇన్వెస్ట్‌మెంట్ చేయాలని నమ్మిస్తున్నారన్నారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తుల సంచారంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయనతో కానిస్టేబుల్ శంకరరావు ఉన్నారు.

విద్యార్థి మృతిపై విచారణ



విద్యార్థులతో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్

మక్కువ రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ఎర్ర సామంతవలస ఆశ్రమ పాఠశాలను ఆదివారం సాయంత్రం సాలూరు జుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ జి.హర్షవర్ధన్ సందర్శించారు. ఈ నెల 15న అనారోగ్యంతో ఆరో తరగతి విద్యార్థి తాడంగి చిన్నారి మృతి చెందిన ఘటనపై ఆయన విచారణ చేశారు. పాఠశాలలో విచారణ అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థి స్వగ్రామంలోనూ విచారణ చేపట్టిన అనంతరం ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు భోజనం, వసతి సౌకర్యాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వంటశాల, వాటర్ ఆర్వో ప్లాంట్, కూరగాయలు, బియ్యం నాణ్యత తదితర వాటిని పరిశీలించారు. పరిసరాల శుభ్రత, విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఆదేశించారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు



తనిఖీ చేస్తున్న పోలీసులు

సాలూరు, అక్టోబరు19 (ఆంధ్రజ్యోతి): సాలూరు ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆదివారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పార్వతీపురం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బాణసంచా పేలుడు నేపథ్యంలో సాలూరు పట్టణ పోలీసులు అప్రమత్తమయ్యారు. సీఐ అప్పలనాయుడు ఆధ్వర్యంలో పట్టణంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌లో బస్సులతో పాటు కార్గో పాయింట్ వద్ద తనిఖీ నిర్వహించారు. పేలుడు సామగ్రి తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారికి హెచ్చరించారు.

రెవెన్యూ జిల్లా సంఘం ఎన్నిక ఏకగ్రీవం



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

పార్వతీపురం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురంలో రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు ఆదేశాలతో ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా గొట్టాపు శ్రీరామ్మూర్తి, ఉపాధ్యక్షులుగా సి.హెచ్.రాధాకృష్ణమూర్తి, ఎన్.శివన్నారాయణ, పి.చిట్టెమ్మ, ఎన్.శ్రీనుబాబు, ఎస్.వెంకటేష్ ఎన్నికయ్యారు. కార్యదర్శిగా ఎ.సాయి కామేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కె.శ్రీనివాసరావు, క్రీడలు-సాంస్కృతిక కార్యదర్శిగా బి.శివరామకృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా బి.శివజగన్మోహన్, బి.హేమలత, పి.కరుణాకర్, జి.నాగేంద్ర ప్రసాద్, కోశాధికారిగా పి.సత్యలక్ష్మీ కుమార్‌లను ఎన్నుకున్నారు. ఈసీ సభ్యులుగా పి.ఎల్.వి.ప్రసాదరావు, ధర్మతేజ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా శ్రీకాకుళం జిల్లా అధ్యక్షుడు కె.శ్రీరాములు, బి.వి.వి.ఎన్.రాజు, పరిశీలకులుగా సిహెచ్.బంగారురాజు వ్యవహరించారు.